క్లుప్తంగా

చాతుర్మాస దీక్షలో రామానందభారతి



దీక్షలో రామానంద భారతి స్వామీజీ. పక్కనే శంకరశర్మ

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో విశాఖపట్నం శ్రీ సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి రామానంద భారతి స్వామీజీ సెప్టెంబర్ 7 వరకు చాతుర్మాస దీక్ష కొనసాగిస్తున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ నివాసంలో ఈ నెల 10 నుంచి ప్రారంభించిన ఈ దీక్షా కార్యక్రమంలో రోజూ అమ్మవారి సమక్షంలో రుద్రాభిషేకం, పాదపూజ అనంతరం లలితా సహస్రనామ పారాయణ, మంగళహారతి తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పారాయణ నిర్వహిస్తున్నారు.

ధర్మానను కలిసిన కామేశ్వరి



ధర్మాన ప్రసాదరావుతో రాష్ట్ర కార్యదర్శి కామేశ్వరి, పార్టీ నాయకులు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా టి.కామేశ్వరి మూడోసారి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ధర్మాన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీజు, భరద్వాజ్, భాస్కరరావు, ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన ఇస్కాన్ పోటీలు



వేషధారణలో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: నగర సమీపంలో పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ జగన్నాథ మందిరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ స్కూల్ చిల్డన్ కాంపిటీషన్ పోటీలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు రామాయణం, మహాభారతంలో అంశాలకు సంబంధించి విచిత్ర వేషధారణలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 75 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ఆగస్టు 17న జరిగే కృష్ణాష్టమి వేడుకల సమయంలో బహుమతులు అందజేస్తామని ఇస్కాన్ నిర్వాహకులు లక్ష్మీపతిదాస్ తెలిపారు.

ఊరటనిచ్చిన వాన



మర్రివలసలో వర్షం కురుస్తున్న దృశ్యం

జి.సిగడాం : ఎండవేడిమి, ఉక్కపోతతో విలవిల్లాడిన జనానికి శనివారం కురిసిన వర్షం కాస్త ఉపశమనం ఇచ్చింది. ఖరీఫ్ సీజన్‌లో కొన్ని ప్రాంతాల్లో వేసిన వరినారుతోపాటు నాట్లు ఎండిపోతున్న సమయంలో వర్షం కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాగులవలస, పెంట, మర్రివలస, మెట్టవలస, సీతంపేట, నక్కపేట, బాతువ, సంతవురిటి గ్రామాల పంటపొలాల్లో ఓ మోస్తరుగా నీరు చేరింది.

వాడిపడేసే వ్యర్థాలతో.. కట్టిపడేసే అందాలు

- ఆకర్షణీయ బొమ్మలకు ప్రాణం పోస్తున్న సూర్యదీప్
- నగర పరిధిలోని పార్కుల్లో ఏర్పాటు



రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఎదురుగా సంజీవయ్య పార్కులో ప్లాస్టిక్ బాటిళ్లతో తయారైన గొడుగు

సండే స్పెషల్

ప్లాస్టిక్ వాటర్ బాటిల్, పాత సైకిల్ చక్రాలు, పనిచేయని కీబోర్డులు.. ఇవన్నీ మన దృష్టిలో వ్యర్థ వస్తువులు. కానీ అరసవల్లికి చెందిన రాయల సూర్యదీప్ దృష్టిలో మాత్రం కళాత్మక వస్తువులకు ప్రాణం పోసే అరుదైన వస్తువులు. పనికి రాని వస్తువులతో ఆకర్షణీయమైన, అద్భుతమైన బొమ్మలను రూపొందిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. వాటిని తన వద్దనే అట్టిపెట్టుకోకుండా అందరూ కలియదిరిగే పార్కుల్లో ఏర్పాటు చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



డైమండ్ పార్కులో ఏర్పాటు చేసిన చేప ఆకృతి



పద్మావతి పార్కులో సీతాకోకచిలుక ఆకృతి

శ్రీకాకుళం కల్చరల్: సాధారణంగా ఇళ్లల్లో వాడిన తర్వాత పనికి రాని వస్తువులను బయటకు చెత్త కింద పారేస్తుంటారు. అయితే వాటిని కూడా సరైన రీతిలో ఉపయోగిస్తే ఇంటిని అందంగా తీర్చిదిద్దవచ్చని సూర్యదీపు నిరూపిస్తున్నారు. శ్రీకాకుళం నగరంలో మున్సిపల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఈయనకు వ్యర్థ పదార్థాలతో అందమైన బొమ్మలను తయారు చేయడం అలవాటు. వాటిని పార్కుల్లో అందంగా అమర్చి సందర్శకులను ఆకట్టుకుంటున్నారు.

మున్సిపల్ యంత్రాంగం సహకారంతో..

వ్యర్థాలతో అందమైన వస్తువులను తయారు చేయవచ్చనే ఆలోచనకు మున్సిపల్ యంత్రాంగం కూడా సహకరిస్తోంది. పార్కుల్లో ఈ బొమ్మలను ఏర్పాటు చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తోంది. డైమండ్ పార్కులో ఇనుము వ్యర్థాలతో చేప ఆకారాన్ని రూపొందించారు. **పద్మావతి పార్కులో** పాత **ఇనుము, సైకిల్** చక్రాలతో **అందమైన** సీతాకోకచిలుకకు ప్రాణంపోశారు. సంజీవయ్య పార్కులో పనికిరాని ప్లాస్టిక్ బాటిళ్లతో అందమైన గొడుగు ఆకారం చేసి నీడగా ఏర్పాటు చేశారు. ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లతో చెత్త వేసుకునే డ్రమ్ములను తయారు చేశారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలైన కీబోర్డులు, సీసీ కెమెరాలు తదితర వస్తువులతో తాబేలు ఆకృతిని సిద్ధం చేసి ఇటీవల జరిగిన బారువా బీచ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు. దీనినే తిరిగి నగరంలో ఉన్న గాంధీపార్కులో ఏర్పాటు చేశారు. ఇలా ఎన్నో వ్యర్థాలతో అందమైన ఆకారాలను తయారు చేస్తున్నారు.



డైమండ్ పార్కులో బాటిళ్లతో చెత్త డబ్బాలు



ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తాబేలు

విభిన్నంగా..



విభిన్నంగా ఆలోచిస్తూ వ్యర్థ వస్తువులతో వివిధ ఆకృతులను తయారు చేయడం ఆనందాన్నిస్తోంది. వీటిని పార్కుల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు కూడా సహకరిస్తున్నారు.

– రాయల సూర్యదీపు, అరసవల్లి

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నేతింటి నీలమప్పడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్

రణస్థలం: నియోజకవర్గంలో ఇటీవల మృతిచెందిన, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న, శస్త్రచికిత్సలు చేయించుకున్న వైఎస్సార్ సీపీ నాయకులను, వారి కుటుంబ సభ్యులను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. పొన్నాడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు, డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన చింతపల్లి దానేస్, లావేరు మండలం సహపురం సర్పంచ్ ప్రతినిధి దారపు రంగారావు, చినమురపాకకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మీసాల వెంకటప్పల నాయుడు, మురపాక వార్డు సభ్యుడు బొడ్డ మల్లిబాబు, ఎచ్చెర్ల సాక్షి విలేకరి ఇజ్జాడ రామారావు, మెట్టవలసకు చెందిన కార్యకర్త పిన్నింటి రమణ, సంచాం గ్రామానికి చెందిన కెల్ల శ్రీనివాసరావు తదితరులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, రాష్ట్ర ఎస్సీ విభాగం జాయింట్ కార్యదర్శి పెయ్యల లక్ష్మణరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు బాలి శ్రీనివాసనాయుడు, సర్పంచ్ దారపు ఆసిరితల్లి, ఉపసర్పంచ్ బస్వ గురయ్య, ఎంపీటీసీ బోర గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెరీర్‌పై దృష్టి పెట్టాలి

జి.సిగడాం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి కెరీర్‌పై దృష్టి సారించాలని జి.సిగడాం ఎస్ఐ వై.మధుసూదనరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడ పేకాట శిబిరాలు జరుగుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

చంద్రబాబువి బూటకపు హామీలు



రావాడలో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: అమలు కానీ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన చంద్రబాబుకు పరిపాలించే హక్కు లేదని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. రణస్థలం మండలం రావాడ, సీతారాంపురం గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వీడియో రూపంలో బాబు మోసాలను వివరించారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో అందించిన సంక్షేమాన్ని మరోసారి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను నట్టేన ముంచారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, బి.సి. సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, ఎచ్చెర్ల యువజన విభాగం అధ్యక్షుడు దన్నాన హరి, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మహంతి అప్పలనాయుడు, ఎంపీటీసీ ప్రతినిధి కిల్లారి సూర్యనారాయణ, మాజీ ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడు కిల్లారి రమణ, ఉప సర్పంచ్ దన్నాన సీతారాం, నాయకులు టేకి బ్రహ్మాజీ, లంక పాపారావు, అసిరినాయుడు, లంక రాము, తెప్పలవలస సర్పంచ్ బొమ్మలాట శ్రీరాములు, ఎంపీటీసీ చోడవరపు అచ్చోడు, సత్యం, మీసాల గాంధీ, అప్పన్న, కృష్ణ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో ఆటవిక పాలన

రణస్థలం/ఎచ్చెర్ల: చంద్రబాబు ఆటవిక పాలన సాగిస్తోందని లావేరు మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు మండిపడ్డారు. లావేరు మండలం కేశవరాయనిపాలెం, చిన్నమురపాక, పెదమురపాక, చిన్నయ్యపేట, గుంటుకుపేట, ఆరంగిపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయించి చంద్రబాబు మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. ఇదే సమయంలో అధికారంలో జగన్ ఉంటే ఎన్ని పథకాలు వచ్చి ఉండేవో, ప్రస్తుత చంద్రబాబు కూటమి పాలనలో ఎన్ని అందాయో తెలియజేశారు. ప్రజల పడుతున్న కష్టాలను నాయకులకు వివరించారు. తల్లికివందనం అందలేదని, చేయూత, ఆసరా, వితంతు పింఛన్లు మంజూరు చేయడం లేదని పలువురు గ్రామస్తులు పార్టీ నాయకుల వద్ద మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, మండల నాయకులు రొక్కం బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ అలుపన రమణమ్మ, రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం జాయింట్ కార్యదర్శి పెయ్యల లక్ష్మణరావు, మండల నాయకులు బాలి శ్రీనివాసనాయుడు, మహంతి విజయలక్ష్మి, వాళ్లె దాలినాయుడు, కొన్ని పరసయ్య, నాయన వెంకటేష్, పెద్ది చిరంజీవి, ఆరంగి శ్రీరామమూర్తి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు మోసాలు ఇంటింటికీ వివరిస్తున్న లావేరు వైఎస్సార్‌సీపీ శ్రేణులు

లావేరులో ఉపాధి ప్రజావేదిక



ఉపాధి హామీ సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

రణస్థలం: ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకొని భూగర్భ జలాలు పెంపొందించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. లావేరు మండలంలోని 2024–25వ ఆర్థిక సంవత్సరంలో రూ. 29,59,95,775 కోట్లు ఉపాధి హామీ పనులు జరిగినట్లు జిల్లా డ్వామా పీడీ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా 33 గ్రామ పంచాయతీల్లోని జరిగిన పనులపై లావేరులో శనివారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. బినామీ వేతనాలు, కొలతల్లో వ్యత్యాసం, సీసీ కాలువ, రోడ్లల్లో నాణ్యత లోపం, బిల్లులు అధికంగా చెల్లించడం వంటి పలు లోపాలను గుర్తించారు. కార్యక్రమంలో ఏపీడీ లోకేష్, పంచాధి రాధ, ఎంపీడీఓ పి.వెంకటరావు, ఏపీవో ఆర్.సత్యవతి, మండల నాయకులు ముప్పిడి సురేష్, రొక్కం బాలకృష్ణ, తోటయ్య దొర, ఎస్ఆర్ పీలు సూర్యనారాయణ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

25న విద్యార్థులకు పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: మున్సిపల్ కార్యాలయం వెనుకన వాటర్ ట్యాంక్ వద్ద ఈశ్వర్ ఆర్ట్స్ అండ్ డిజిటల్స్ వద్ద సోదవరం హేమలత 75వ జయంతి పురస్కరించుకొని ఈ నెల 25న విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ సేవకుడు సోదవరం ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు 'అమ్మ ప్రేమ' అనే అంశంపై వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు, సాయంత్రం 5గంటలకు కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ఆరోహి సంగీత కళాశాలలో పాటల పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనవచ్చని కోరారు.

శ్రీనివాసా గోవిందా..



మొండేటివీధిలో వెంకన్నకు పూజలు



దూదివారి కోవెలలో తులసిమాలల అలంకరణలో..



నారాయణ తిరుమలలో స్వామివారు



డీసీసీబీ కాలనీలో పూజలందుకుంటున్న వెంకన్న

శ్రీకాకుళం కల్చరల్ : గుజరాతీపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించారు. వేంకట రామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. డీసీసీబీ కాలనీలోని భూ సమేత వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని పూలమాలలతో అలంకరించారు. అర్చకులు చామర్తి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. చిన్న బజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ఎచ్చెర్ల : ప్రతిజ్ఞ చేస్తున్న చేస్తున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది, విద్యార్థులు



ఎచ్చెర్ల: చెత్తాచెదారాలు తొలగిస్తున్న వర్శిటీ సిబ్బంది



శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, అధికారులు, సిబ్బంది



రణస్థలం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణం జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో శనివారం శివానీ క్యాంపస్ ఆవరణలో పీయూసీ వలంటీర్లతో శ్రమదానం చేయించారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, ఏవో డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, వెల్ఫేర్ డీన్ డాక్టర్ గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, క్యాంపస్ ఇన్‌చార్జి బి.సాగర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ పెద్దింటి ముకుందరావు, పీఓ బి.శ్రీధర్, ఆర్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆవరణలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వీసీ కె.ఆర్.రజిని, రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, స్వచ్ఛ ఆంధ్రా క్యాంపస్ నోడల్ అధికారి డి.చక్రపాణి, వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని పీఎస్ఎన్ఎం స్కూల్ ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రణస్థలం: మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వి.ప్రకాశరావు, ఏవో మార్కండేయులు, పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: గూనపాలెంలో వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీ కె.ఝాన్సీ ఆధ్వర్యంలో తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ఉదాసీనత ప్రదర్శిస్తున్న తీరుకు నిరసనగా మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మోనింగి వారి వీధిలో ఉన్న మస్టర్ పాయింట్ వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్–ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తాడి సంతోష్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.